క్లుప్తంగా

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం


విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో వినాయక, అంకాలమ్మ, దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ హోమ పూజలు చేశారు. అనంతరం విగ్రహాలకు జలాభిషేకం చేసి సాయంత్రం గ్రామంలో ఊరేగించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుందని గ్రామస్తులు తెలిపారు.

శనైశ్చరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్: పట్టణంలో నిర్మిస్తున్న శనైశ్చర స్వామి ఆలయ నిర్మాణానికి డోన్‌కు చెందిన కళాంజలి మెన్స్‌వేర్ యజమాని లక్ష్మీకాంత శెట్టి, గీతప్రియ దంపతులు రూ. 99,999 విరాళం ఇచ్చారు. శనివారం ఆలయ అర్చకుడు విహారిస్వామిని కలిసి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వదించారు.

వైద్య పరికరం అందజేత


నెబులైజర్‌ను అందజేస్తున్న దాత

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని అత్యవసర విభాగంలో వైద్య సేవల నిమిత్తం శనివారం విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య పరికరాన్ని అందజేశారు. రోగుల సౌకర్యార్థం ఆ ఫౌండేషన్ అధినేత గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి నెబులైజర్ మిషన్‌ను డాక్టర్ నవీన్ కుమార్‌కు అందజేశారు. హెడ్‌నర్స్ లక్ష్మి, స్టాఫ్ నర్స్ సరోజినీదేవి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శుభకార్యం

బనగానపల్లె రూరల్: పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.భాస్కర్‌రెడ్డి కుమారుడు సురేంద్రారెడ్డి వివాహ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పలు వివాహ వేడుకల్లోనూ వారు పాల్గొని నూతన జంటలకు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డుపై గుంత పూడ్చివేత


గుంతను పూడ్చుతున్న దృశ్యం

ప్యాపిలి: గార్లదిన్నె–బనగానపల్లె రహదారిలోని గుంతను జలదుర్గం ఎస్‌ఐ నాగార్జున పూడ్చివేయించారు. కొద్ది రోజుల క్రితం ఏర్పడిన భారీ గుంత ప్రమాదలకు నిలయంగా మారింది. తరచూ వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గుంత పూడ్చివేతకు చర్యలు తీసుకున్నారు. గుంతను మట్టితో పూడ్చి సిమెంటు, కంకర వేశారు. గుంతను పూడ్చిన పోలీసులను స్థానికులు అభినందించారు.


ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


కిందికి వేలాడుతున్న తీగలను చూపుతున్న స్థానికుడు

సంజామల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు నేలకు దగ్గరగా వాలిపోవడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని కాలనీ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సండే స్పెషల్

నాటి బేతాళపురం.. నేటి బేతంచెర్ల



- 18వ శతాబ్దంలో పరిపాలించిన బేతాళరాజు
- నాటి చరిత్రకు సాక్ష్యంగా కోట ముఖద్వారం, బురుజు

బేతంచెర్ల: ఒక్కో గ్రామానికి ప్రత్యేకమైన చారిత్రక నేపథ్యం ఉంటుంది. అదే తరహాలో ప్రస్తుత బేతంచెర్ల పట్టణాన్ని 18వ శతాబ్దంలో బేతాళరాజు పాలకుడిగా ఉన్నారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. అప్పట్లో ఈ ప్రాంతం ''బేతాళపురం''గా పిలవబడేది. కాలక్రమేణా బ్రిటిష్ హయాంలో ''బేతంచెర్ల''గా రూపాంతరం చెందింది. ఆ కాలంలో గద్వాల ప్రాంతాన్ని సోమనాథుడు అనే రాజు పాలించేవాడు. రాజ్య విభేదాల నేపథ్యంలో శత్రువులు కోటను ముట్టడించడంతో సోమనాథుడు తన భార్య, పిల్లలను రహస్య ద్వారం గుండా సురక్షిత ప్రదేశానికి తరలించాడు. తరువాత ఆయన పంచకళ్యాణి అనే అశ్వంపై ప్రయాణించి ప్రస్తుత ముచ్చట్ల ప్రాంతానికి చేరుకున్నారు. అప్పట్లో ఆ ప్రాంతం అడవులతో నిండి వుండేది. అశ్వం అలసటతో ఆగిపోయిన సమయంలో రాజు విశ్రాంతి తీసుకుంటుండగా ఓ తోడేలు మేకపిల్లను వేటాడుతూ వచ్చింది. తోడేలు నుంచి మేకను రక్షించేందుకు రాజు విసిరిన కర్ర మేకపిల్లకు తగిలి అది ఎగిరి పారిపోవడంతో ప్రస్తుత బేతంచెర్ల ప్రాంతానికి చేరి దేవుని బావి వద్ద ఆగిందని పౌరాణిక కథనం చెబుతుంది. అప్పటి నుంచి ఆ ప్రాంతం పవిత్రస్థలంగా మారిందని స్థానికులు విశ్వసిస్తారు. తరువాత రాజు ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి కోటగోడలు, కందకాలు తవ్వించి తన కుమారుడు బేతాళుని పేరుతో ''బేతాళపురం''గా నామకరణం చేశాడు. కాలానుగుణంగా ఆ పేరు ''బేతంచెర్ల''గా పరిణమించింది. ఇప్పటికీ కోటపేటలో ఉన్న ముఖద్వారం నాటి శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. కోటపేట, డ్రైవర్స్ కాలనీ మధ్య ఉన్న కందకం శత్రువుల దాడుల నుంచి రక్షణ కోసం తవ్వినదని చరిత్ర చెబుతోంది. అలాగే పట్టణంలోని గౌరిపేటలో చెన్నకేశవస్వామి ఆలయం, ముచ్చట్లలో మల్లికార్జునస్వామి దేవస్థానం, తూర్పున గట్లనరసింహస్వామి ఆలయాలు బేతాళరాజు కాలంలోనే నిర్మించబడినవని విశ్వసిస్తున్నారు. పట్టణంలో ఉన్న పూదోటమఠం, బోయపేట, దుర్గాపేట, రైల్వే స్టేషన్ సమీపంలోని శివలింగాలన్నీ ఒకే ఆకారంలో ఉండడం విశేషం. చారిత్రక ప్రాధాన్యంతో పాటు రంగురాళ్లకు ప్రసిద్ధి చెందిన బేతంచెర్ల, నేడు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన కేంద్రంగా గుర్తింపుపొందింది.


నాటి చరిత్రకు సాక్ష్యంగా ఉన్న కోటపేట ముఖద్వారం


కోటపేటలో ఉన్న బురుజు


చెన్న కేశవస్వామి ఆలయం

బావులు ఉండేవి



ప్రస్తుతం ఉన్న కోటపేట, గౌరిపేట, బేగరిపేట కాలనీల్లో నాడు బేతళరాజు నిర్మాణాలు చేపట్టారని చెప్పడానికి సాక్ష్యంగా కందకంతో పాటు కోట బురుజు, ముఖ ద్వారాలు ఉన్నాయి. కోటపేటలో బావులు కూడా ఉండేవి. కాలక్రమేణా అవి శిథిలావస్థకు చేరుకోవడంతో పూడ్చి వేశారు.

–మద్దిలేటి, బేతంచెర్ల

బేతాళరాజు హయాంలోనే ఆలయాల నిర్మాణం



18వ శతాబ్దంలోనే గద్వాల రాజు సోమనాథుడు కుమారుడు బేతాళరాజు ఈ ప్రాంతాన్ని పరిపాలించినట్లు చారిత్రక ఆధారంగా తెలుస్తోంది. ఆయన పాలనలోనే బేతంచెర్ల పట్టణంలో ఆంజనేయ, చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణం జరిగినట్లు రికార్డుల ఆధారం ఉంది.

–రామ్మూర్తి శర్మ, ఆలయ అర్చకుడు

చెక్కు చెదరని కోట ముఖ ద్వారం



నాటి కళానైపుణ్యానికి నిదర్శనంగా కోటపేట కోట ముఖద్వారం దర్శనమిస్తుంది. నాడు కోటపేట సమీపంలో శత్రు రాజుల నుంచి రక్షణ కోసం కందకం తవ్వడమే కాకుండా రాతి కట్టడాలు నిర్మించారు. కాల క్రమేణా కోట బురుజులు కూలిపోగా కందకం మాత్రం అలాగే ఉంది.

–హుసేన్‌రెడ్డి, బేతంచెర్ల

కోటపేట చుట్టూ బురుజులు ఉండేవి



మా చిన్నతనంలో కోట గోడలు, కందకంతోపాటు 100 గజాలకు ఒక బురుజు చొప్పున ఉండేవి. కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుని కూలిపోయాయి. పూదోట మఠం వెనుక వైపు కూడా దేవతా విగ్రహాలు ఉండేవి. చారిత్రక నేపథ్యం ఉన్న పట్టణం అని చెప్పడానికి ఆనాడు నిర్మించిన కట్టడాలే సాక్ష్యం.

– బుగ్గన చంద్రారెడ్డి, బేతంచెర్ల

బాలికా విద్యను ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న సీఐ హనుమంతునాయక్

కోవెలకుంట్ల: మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్, సీఐ హనుమంతునాయక్ అన్నారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలను వంటింటికే పరిమితం చేయకుండా ఉన్నత చదువులు చదివిస్తే వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. నేటి ఆధునిక యుగంలో మహిళలు పురుషులతో పోటీ పడి అన్ని రంగాల్లో సత్తాచాటుతున్నారని తెలిపారు. అనంతరం బాలికల హక్కులు, సురక్షిత సమాజ నిర్మాణం, సమాన హక్కులు, తదితర అంశాలను ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీదేవి, రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల నిర్వహణపై చైర్మన్ అసహనం


మున్సిపల్ పార్కులో వాకింగ్ ట్రాక్‌కు అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది


డోన్: మున్సిపల్ పరిధిలోని ఏడు పార్కులను ఇకపై సుందరవనాలుగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శనివారం వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్‌తో కలిసి మున్సిపల్ ఆవరణలోని పార్కు పరిశుభ్రత పనులను ప్రారంభించారు. కొంతకాలంగా పార్కుల నిర్వహణను అధికారులు గాలికి వదిలివేయడంపై అసహనం వ్యక్తం చేశారు. పార్కుల్లో పిచ్చిమొక్కలు ఎక్కువగా పెరగడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారని, వారాంతపు సెలవుల్లో పచ్చదనాన్ని ఆస్వాదించేందుకు వచ్చే చిన్నారుల సంఖ్య కూడా తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన పార్కులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం తప్పదు


ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి

బనగానపల్లె రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయుల విద్య, ఆర్థికపరమైన డిమాండ్ల సాధన కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. ఈ నెల 7న విజయవాడలో జరిగిన ధర్నా తరువాత కూడా ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ రావు, రాష్ట్ర కౌన్సిలర్ సుబ్బరాయుడు, నాయకులు శేఖర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామికి విశేష పూజలు


ఆలయ ఆవరణలో భక్తుల సందడి

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఆశ్వయుజ మాసం సందర్భంగా శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వేకువ జామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదాల నిర్మూలనే లక్ష్యం

బేతంచెర్ల: కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గోర్లగుట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో నాపరాళ్ల ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపి ప్రమాదానికి కారణం అయితే యజమానిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనరికార్డులతో పాటు నిబంధనలు పాటించాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన రహదారి వెంట కాకుండా సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీ మీదుగా నాపరాళ్లను ఫ్యాక్టరీలకు తరలించాలన్నారు. అర్హులైన వారు డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయిస్తామన్నారు. నందివర్గం, బేతంచెర్ల ఎస్‌ఐలు వెంకట సుబ్బయ్య, తిరుపాలు పాల్గొన్నారు.

కారును చోరీ చేసి వెళ్తుండగా ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు

డోన్ టౌన్: హైదరాబాద్‌లో దొంగలించిన కారు డోన్ సమీపంలో ప్రమాదానికి గురైంది. నాంపల్లె పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన కారును అపహరించిన దొంగలు శనివారం తెల్లవారుజామున డోన్ వైపుకు వస్తుండగా అబ్బిరెడ్డిపల్లె చెరువు వద్ద టర్నింగ్‌లో కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు కారు వివరాలు సేకరించి, అది నాంపల్లె పోలీస్‌స్టేషన్‌లో చోరీ కేసుగా నమోదైందని నిర్ధారించారు. పట్టుబడతామనే భయంతో నంబర్ ప్లేట్, ఫాస్ట్ ట్యాగ్ తొలగించి గ్రామ రహదారుల మీదుగా ప్రయాణిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో కారులో ఉన్నవారు ఎవరు, ఎక్కడికి వెళ్లారన్నది ఇంకా తెలియరాలేదు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: డోన్–బేతంచెర్ల జాతీయ రహదారి పనుల్లో భాగంగా కొత్తబుగ్గ వద్ద 33 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. చిన్న మల్కాపురం, బేతంచెర్ల మండలంలోని రంగాపురం, గూటుపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంట్ తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇస్తామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బేతంచెర్ల: గోరుమానుకొండ సమీపంలోని ఎంజేపీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దేవేంద్ర కుమార్ తెలిపారు. కర్నూలులోని డీఎస్‌ఏ స్టేడియంలో శనివారం జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు జరిగాయి. ఇందులో ఎంజేపీ స్కూల్ విద్యార్థులు అఖిల్, ఉదయ్, ప్రదీప్, సాయిచరణ్, ప్రశాంత్, రాహుల్ తేజ, వసంత్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు సంజీవ, నాగేశ్వ అభినందించారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ అంతంత మాత్రమే



కొలిమిగుండ్లలోని ఎస్సీ ప్రాథమిక పాఠశాల

- పాఠశాలల్లో సగం పోస్టులే భర్తీ

కొలిమిగుండ్ల: డీఎస్సీ 2025 ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ అవుతాయని అందరూ భావించినా చివరకు నిరాశే ఎదురవుతోంది. కూటమి ప్రభుత్వం సగం పోస్టులు మాత్రమే భర్తీ చేస్తుండడంతో ఇంకా సగం పోస్టులు ఖాళీ ఏర్పడుతున్నాయి. దీంతో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల లేని లోటు స్పష్టంగా కనిపించనుంది. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కేంద్రాల్లోనే ఎస్జీటీలకు మ్యానువల్‌గా పాఠశాలల ఎంపిక చేసి అక్కడే నియామక పత్రాలు అందిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంలో 67, అవుకు మండలంలో 63 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. డీఎస్సీలో పూర్తి స్థాయిలో పోస్టులు భర్తీ అవుతాయని విద్యాశాఖ అధికారులు, తల్లితండ్రులు భావించినా చివరకు నిరాశే ఎదురైంది. కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం బదిలీలు నిర్వహించింది. చాలా పాఠశాలల్లో సింగిల్ టీచర్లు ఉండడంతో వాళ్లు రిలీవ్ అయితే అక్కడ మరొక ఉపాధ్యాయుడు లేకపోతే పాఠశాలలు మూత పడుతాయని భావించి కొత్త డీఎస్సీలో ఉపాధ్యాయులు వచ్చే వరకు అక్కడే విధులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చాలా మంది ఉపాధ్యాయులు బదిలీ అయినా రిలీవర్ లేక పాత పాఠశాలల్లోనే దాదాపు ఐదు నెలల పాటు పని చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం ఎక్కువ భాగం ఎస్జీటీ టీచర్లను సింగిల్ టీచర్ల స్థానంలోనే భర్తీ చేశారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో హెచ్‌ఎంతో పాటు నలుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉంది. ఈ పాఠశాలల్లో సైతం పోస్టులు నామమాత్రంగానే భర్తీ అయినట్లు తెలుస్తోంది. కొత్తగా ఎంపికైన టీచర్లను దాదాపుగా సింగిల్ టీచర్ల స్థానంలోనే కేటాయించారు. దీంతో కొత్త ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని భావిస్తున్నారు. సీనియర్ ఉపాధ్యాయుడు ఉన్న చోట అయితే యాప్‌లలో అప్‌లోడ్, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై అవగాహన వచ్చేదని సింగిల్ టీచర్ స్థానంలో పోస్టింగ్ ఇవ్వడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నట్లు తెలిసింది.

అనుమతి లేకుండా టపాసులు విక్రయించొద్దు

కొలిమిగుండ్ల: దీపావళి పండుగ సందర్భంగా అనుమతి లేకుండా టపాసులు విక్రయించొద్దని సీఐ రమేష్‌బాబు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం కొలిమిగుండ్లలో పలువురు వ్యాపారులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. పర్మిషన్ ఉన్న వాళ్లు మాత్రమే టపాసులు విక్రయాలు చేపట్టాలని లేని వాళ్లు అమ్మరాదని పేర్కొన్నారు. వ్యాపారులు ఎవరైనా పర్మిషన్ లేకుండా టపాసులు అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మురుగు కష్టాలు


బీసీ హాస్టల్ సమీపంలో పొర్లుతున్న మురుగునీరు


అంసపూర్తిగా ఉన్న డ్రైనేజీ విస్తరణ పనులు

- అసంపూర్తిగా డ్రైనేజీ పనులు
- చిన్నపాటి వర్షానికే జలమయం

కోవెలకుంట్ల: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్‌ఎల్‌వీ సినిమా థియేటర్ వెనుకవైపు ప్రాంతంలో డ్రెయినేజీ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండటంతో రెండు నెలల క్రితం రోడ్డుకు రెండువైపులా డ్రైనేజీ పనులు ప్రారంభించారు. అయితే ఒకవైపు డ్రైనేజీని ఏర్పాటు చేసి మెయిన్ డ్రెయిన్‌కి కలపకుండానే బీసీ హాస్టల్ సమీపంలో వదిలేశారు. మరో వైపు కాల్వను విస్తరించాల్సి ఉండగా మధ్యలోనే పనులు నిలిపివేశారు. లక్షల రూపాయలు వెచ్చించి పనులు ప్రారంభించినప్పటికీ పూర్తి చేయకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. లోతట్టు ప్రాంతం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీ పొంగిపొర్లి రోడ్లపై మోకాలి లోతు నీరు ప్రవహిస్తోంది.

దీంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్గంధం, దోమల బెడద ఎక్కువైంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను పూర్తి చేసి మురుగు కష్టాలనుంచి తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

విశ్వకర్మయోజనతో చేతివృత్తులకు చేయూత


పనిముట్లను అందజేస్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్: ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకం ద్వారా చేతివృత్తుల్లో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోస్టాఫీసు వద్ద ఈ పథకంలో శిక్షణ పొందిన లబ్ధిదారులకు పనిముట్లు, శిక్షణా కాల స్టయిఫండ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ పథకం కింద 18 రకాల కులవృత్తుల వారికి ఉచిత శిక్షణ ఇచ్చి రోజుకు రూ.500 స్టయిఫండ్, శిక్షణ పూర్తయ్యాక రూ.15 వేల విలువైన పనిముట్లు ఇస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా బ్యాంకుల ద్వారా 5 శాతం వడ్డీకి రూ.లక్ష రుణం ష్యూరిటీ లేకుండా అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ కృష్ణనాయక్, పోస్టు తిమ్మారెడ్డి, బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు, హరినాయుడు, ముదిరాజ్, లక్ష్మీనారాయణ, చంద్ర పాల్గొన్నారు.